# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 10, జనవరి 2026




## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు
# మెనూ ప్రకారం ఆహారం అందించాలి

✪ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ / రెబ్బెన, జనవరి 9, ప్రభాతవార్త :

విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారితో కలిసి సందర్శించి వంటశాల, వంట సామాగ్రి నిల్వ గది, మెనూ పట్టిక, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పౌష్టిక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. వంటశాల, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వార్షిక పరీక్షలలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించాలని, చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఉదయం వేడి నీరు అందించాలని, ఆహారం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలని తెలిపారు.

అనంతరం విద్యార్థినులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

✤ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 9, ప్రభాతవార్త

బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, బాలల సంక్షేమ కమిషన్ చైర్మన్ మహమ్మద్ వహీద్ లతో కలిసి సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు, కార్మిక, విద్య, వైద్యఆరోగ్య, పౌర సంబంధాల శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖల అధికారులు బృంద సభ్యులతో కలిసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులను గుర్తించాలని తెలిపారు. 14 సం॥లలోపు వయసు కలిగి బాల కార్మికులు పని చేస్తున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత సంస్థల మిగతా 2లో..

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్‌రూరల్, జనవరి 9, ప్రభాతవార్త:

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు మిగతా 2లో..



# క్రీడా పోటీలలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

✪ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

– ఆసిఫాబాద్, జనవరి 9, ప్రభాతవార్త



2లో..

# అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం

✦ అసలైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ ✦ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జనవరి 09, ప్రభాతవార్త:



పేదలు, గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమించినా, తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరిట అక్రమంగా బదిలీ అయిన భూములను స్వాధీనం చేసుకుని, అసలైన లబ్ధిదారులకు కలెక్టర్ పట్టాలు అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన అడ్డురి రమణ బాయి (భర్త: అశోక్)కు ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 83లో 1 ఎకరం 15 గుంటల భూమి కేటాయించగా, సదరు భూమిని మరొక వ్యక్తి చట్టవ్యతిరేకంగా తన పేరిట పట్టా చేసుకున్నాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి మిగతా 2లో..

# చైనా మంజా అమ్మకాలపై విస్తృత తనిఖీలు

**చైనా మంజా విక్రయించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు - పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, జనవరి 9, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని చైనా మంజా అమ్మకాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజల ప్రాణభద్రతను కాపాడే లక్ష్యంతో చైనా మంజా అమ్మకాలు, నిల్వలు మరియు రవాణాపై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చైనా మంజా వల్ల ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, చిన్నారులు మరియు పక్షులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని, గతంలో పలువురు గాయపడిన ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, ముందస్తు చర్యలలో భాగంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక బృందాలతో మార్కెట్లు, దుకాణాలు, గోదాములు, రోడ్లపై విస్తృత తనిఖీలు చేపట్టారు. చైనా మంజా తయారీ, అమ్మకం, నిల్వ మరియు వినియోగం పూర్తిగా నిషేధించబడినవని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయించినా లేదా వినియోగించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి చైనా మంజాను వినియోగించకుండా ఉండాలని, తమ పిల్లలను కూడా దాని నుంచి దూరంగా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా చైనా మంజా అమ్మకాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల సహకారంతోనే ప్రమాదాలను పూర్తిగా నివారించగలమని పోలీసులు తెలిపారు.



దుకాణాల్లో చైనా మాంజా గురించి చెక్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

# ఆంగ్లంపై పట్టు సాధిస్తే ప్రపంచాన్ని నెగ్గవచ్చు

**కాగజ్‌నగర్, జనవరి 9, ప్రభాతవార్త**

ఇంగ్లీషు ప్రపంచానికి దారులు తెరుస్తుందని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. విద్యార్థులు ఆంగ్లం పై పట్టు సాధిస్తే ప్రపంచాన్ని నెగ్గుకు రావచ్చున్నారు. శుక్రవారం కాగజ్నగర్ డివిజనల్ రిసోర్స్ సెంటర్ లో ఎస్సీ ఈఆర్టీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెడ్ ఎండ్ టాక్స్, ఇంగ్లీష్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేసిన వారు విద్యార్థులు నుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంపొందించేందుకు ఎల్టా వారు నిర్వహించిన ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభచాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ కోఆర్డినేటర్ శాంతి కుమార్, ఎల్టా జిల్లా అధ్యక్షుడు తులసీ రామ్, ఉపాధ్యక్షులు హదియా, మీడియా కోఆర్డినేటర్ డి.వెంకటేశ్వర్లు, ఎల్టా ప్రతినిధులు శంకర్ రావు, శ్రీనివాస్, సత్యం పాల్, మల్లయ్య, గైడ్ టీచర్లు, వి వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.




మెమొంట్ అందజేస్తున్న మూనిటరింగ్ అధికారి శ్రీనివాస్

**రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు..**

జెడ్పి, ప్రభుత్వ పాఠశాల విభాగంలో టాక్ జూనియర్స్ ఈవెంట్ లో ఆర్.సహస్ర (జెడ్ పి ఎస్ ఎస్ జనకాపూర్), సీనియర్స్లో జె.రాధ (జి హెచ్ ఎస్ ఓల్డ్ కాగజ్నగర్), టియో పరీక్షలో జూనియర్స్లో జె.ప్రజ్ఞా న్ (జెడ్పిహెచ్ఎస్ వాంకిడి), సీనియర్స్ లో జె వంశీ (జెడ్పిఎస్ఎస్ వాంకిడి) విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టీజీఎంఎస్, కేజీబీవీ విభాగంలో టియో టెస్టులో జూనియర్స్ నుంచి డి శైలజ, సీనియర్స్ నుంచి విజయ వైష్ణవి, టెడ్ఎడ్ టాక్ జూనియర్స్ నుంచి కే. ప్రశాంతి కౌటాల, సీనియర్స్ నుంచి ఈ. శిరీష కౌటాల రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

# యాదవ సమాజానికి దిక్సూచి డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్: చిన్న శ్రీశైలం

**భీమారం, జనవరి 9, ప్రభాతవార్త**

నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న తెలంగాణ రాష్ట్ర, గొర్రె, మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, యాదవ సమాజానికి, యువతకు దిక్సూచిగా నిలిచాడానిచిన్న శ్రీశైలం యాదవ్ అన్నారు. హైదరాబాద్ యూసుఫ్ గూడాలోని చిన్న శ్రీశైలం యాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరుపేదలను ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు మన యాదవ ముద్దుబిడ్డ అని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కార్పొరేటర్లు కుల సంఘం నాయకులు అహర్నిశలు విజయం సాదించుటకు కృషి చేసిన, ప్రతి ఒక్కరికి ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ తన నివాసంలో నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేసిన సందర్భంగా అభినంశించారు. సామాజిక సేవకుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ చేసిన సేవలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలని ప్రజల్లోకి తీసుకు వెళుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వారధిల పని చేస్తూ, నిరుపేదలకు వృద్ధులకు సేవా చేస్తూ ఉంటాడని, కరోనా నేపథ్యంలో కష్టకాలంలో ఉన్న వారికి అశోక్ చేసిన సేవలకు గౌరవ డాక్టరేట్ అందుకోవడం హర్షించదగ్గ విషయమని, ఆయనను పూల మాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంకే రాజేష్ పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం ఆహారం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, బాధిత బాలలకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గుర్తించబడిన బాల కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్ నిర్వహించడం జరుగుతుందని, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అవసరమైన పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, బాలల పరిరక్షణ కమిటీ అధికారి ఆనంద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలలో జిల్లాకు
# మంచి పేరు తీసుకురావాలి

**ఆసిఫాబాద్, జనవరి 9, ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న క్రీడా పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా యువజన క్రీడా సేవల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సిఎం కప్ క్రీడలు 2025 టార్చ్ ర్యాలీని జిల్లా ఎస్పీ నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, జిల్లా యువజన క్రీడల అధికారి అశ్వక్ తో కలిసి కాగడా వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. సిఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్తమ ప్రతిభ కనబరచాలని తెలిపారు. టార్చ్ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొమురం భీమ్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సంచాలకులు, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్, అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

విచారణ చేపట్టిన అధికారులు అక్రమ పట్టాను రద్దు చేసి, తిరిగి అడ్డురి రమణ బాయి పేరిట పట్టా జారీ చేశారు. అలాగే సిరికొండ మండలానికి చెందిన కుమరం జంగు బాపు (తండ్రి: సుంగు)కు చెందిన సర్వే నంబర్ 57/తి/1లోని 6 ఎకరాలు 18 గుంటల భూమిని పలువురు వ్యక్తులు మోసపూరితంగా తమ పేరిట పట్టా మార్చుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భూభారతి చట్టం కింద అప్పీల్ విచారణ చేపట్టి, అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, తిరిగి కుమరం జంగు బాపుకు భూమి పట్టా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కలెక్టర్‌కు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఆర్డీఓ స్రవంతి, ఆదిలాబాద్ రూరల్, సిరికొండ తహశీల్దార్లు గోవింద్ నాయక్, తుకారాం లను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయా మండలాల తహశీల్దార్లు, లబ్ధిదారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, జనవరి 9, ప్రభాతవార్త

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి అంజయ్య, శ్రీనిధి రీజినల్ మేనేజర్ వెంకటరమణలతో కలిసి శ్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజ్‌ల మంజూరు, రికవరీల పై జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, సెర్ప్ ఆధ్వర్యంలోని శ్రీనిధి సిబ్బంది, సామాజిక సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అన్ని రంగాలలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. జిల్లాలో 2025 26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీనిధి రుణాల లక్ష్యం 42 కోట్ల రూపాయలకు గాను 46 శాతంతో 19 కోట్ల 47 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రికవరీలో భాగంగా 49 శాతం రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రికవరీ పరంగా 25వ స్థానంలో కొనసాగడం జరుగుతుందని, జిల్లాలో తక్కువ రికవరీ ఉన్న మండలాల ప్రతినిధులు రికవరీ శాతాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకు లింకేజీ విషయంలో 422 కోట్ల రూపాయలకు గాను 311 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చేయడం జరిగిందని, ఓవర్ డ్యూ 0.68 శాతంగా నమోదు అయిందని, ఈ క్రమంలో సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకుని తక్కువ ప్రగతి సాధించిన మండలాలు వృద్ధి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకుల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలాల వారిగా కమ్యూనిటీ కో ఆర్డినేటర్ల పని తీరు పరిశీలించి, విధుల పట్ల నిరక్ష్యం వహించే కమ్యూనిటీ కో ఆర్డినేటర్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్‌లో గల సిసిసి కార్నర్‌లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించడం జరుగుతుందని, ఇందులో మొదటి బ్యాచ్‌లో ప్లంబింగ్, శానిటేషన్ పై నెల రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో డిమాండ్ ఎక్కువగా ఉన్న పనులకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి ఆధ్వర్యంలో అమరవాది చెరువు పూడిక తీత

రామకృష్ణాపూర్, జనవరి 9, ప్రభాతవార్త

రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్, సింగరేణి ఆధ్వర్యంలో అమరావది చెరువు పూడిక తీత పనులను శుక్రవారం చేపట్టారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ ఆదేశాల మేరకు ఎస్.ఓ.టు జిఎం ప్రసాద్ పూడిక తీసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పూడిక పనులను సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా చేపడుతున్నట్లు తెలిపారు. చెరువు నీటితో 130 ఎకరాల ఆయకట్టుతో లబ్ధి సాగు అవుతుందని అన్నారు. ఈ పూడిక తీసి వేయడం వలన భూగర్భ నీటి లభ్యత పెరుగుతుందని, మత్స్యకారులు చేపలు పెంచుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మందమరి ఏరియా పర్సనల్ డీ.జీ.ఎం అశోక్, సివిల్ ఎస్.ఇ శ్రీధర్, రామకృష్ణా పూర్ ఓపెన్ కాస్ట్ ఇంచార్జ్ మేనేజర్ పంకజ్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శారద, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

## - జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో అవగాహన కార్యక్రమం



మందమర్రి, జనవరి 9, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కాసిం సాహిబ్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 1 నుంచి 31 వరకు జరుగుతున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు, విద్యార్థులకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ల యజమానులు సీటుబెల్ట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. చట్ట ఉల్లంఘనలకు కఠిన చర్యలు18 సంవత్సరాలు నిండకముందే లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడ్ సమరీటన్ పథకం వివరాలురోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి తరలించేందుకు చొరవ తీసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమరీటన్ పథకం ద్వారా రూ.25,000 నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. పాల్గొన్న వారుఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, పీఆర్ఓ దయాకర్, రవీందర్, జీవన్ తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## పాఠశాలలో సర్పంచ్‌కు సన్మానం

వేమనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త

ఇటీవల జరిగిన స్థానిక పంచాయతీ ఎన్నికల్లో నీల్వాయి గ్రామ పంచాయతీలో ఘన విజయం సాధించిన సర్పంచ్ చెన్నూరి సమ్మయ్యను నీల్వాయి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుకర్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. నీల్వాయి ప్రాథమికోన్నత పాఠశాలలోనే విద్యనభ్యసించి నీల్వాయి గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ ఈ పాఠశాలలో అనేక జ్ఞాపకాలు ఉన్నాయని, నా బాల్యం మొత్తం ఇదే పాఠశాలలో గడిచిందని ఇదే గ్రామానికి సర్పంచ్ కావడంతో నాకు ఇంకా ఎక్కువ బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తలండి శంకర్, స్రవంతి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయండి

రామకృష్ణాపూర్, జనవరి 9, ప్రభాతవార్త

18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను సిపిఐ పార్టీ కార్యకర్తలు, నాయకులు, విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. శుక్రవారం జీపు జాత మందమర్రి నుండి రామకృష్ణాపూర్ పట్టణానికి చేరుకోగా స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి ద్దాగ మల్లేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, భీమనాథుని సుదర్శన్, వనం సత్యం, మామిడి గోపి, గుమాస మల్లేష్, నక్క వెంకటస్వామి, రవి, వంశీ, బండారి, రాజేశం పాల్గొన్నారు.




# జర్నలిస్టుపై దుర్భాషలాడిన కార్యూరి రాంచందర్‌పై చర్యలు తీసుకోవాలి

## - బీఆర్ఎస్ నాయకుల డిమాండ్




బెల్లంపల్లి, జనవరి 9, ప్రభాతవార్త

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న వారు జర్నలిస్టులు. అటువంటి ఎన్టీవీ జర్నలిస్ట్ అందుగుల రమేష్‌ను కాంగ్రెస్ నేత కార్యూరి రామ్ చందర్ దూషించి దుర్భాషలాడడం అమానుషమని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ లు మాట్లాడారు. వాస్తవాలు ప్రజలకు తెలియజేసే క్రమంలో వార్తలు రాస్తున్న జర్నలిస్టు లపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం కుటుంబీకులను సైతం దూషించడం పరిపాటిగా మారింది అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి మొదలుకొని కార్యకర్తల వరకు వాస్తవాలు మాట్లాడే ప్రజలపై జర్నలిస్టులపై దూషణలకు దిగుతున్నారని పేర్కొన్నారు. దూషణలకు దిగిన రాంచందర్ వైఖరి పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందన్నారు. రామచందర్ ఎన్టీవీ రిపోర్టర్ రమేష్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రమేష్‌కు న్యాయం జరిగే వరకూ జర్నలిస్టుల పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. రిపోర్టర్ ఏదైనా తప్పుగా రాస్తే వివరణ ఇవ్వాలి, లేదా చర్చించాలని, ఇలా ఇష్టం వచ్చి నట్లు దూశించడం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ స్టీరింగ్ కమిటీ నాయకుడు ఎరుకల సుందర్రావు, టీబీజీకే సెంట్రల్ కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, బడికల రమేష్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఎస్ డి వాజీద్, ఉస్మాన్ భాయ్, యూత్ నాయకులు లడ్డు, ఆకుల సాయి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో టాప్‌లో నిలవాలి

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్, జనవరి 09, ప్రభాతవార్త:**

పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్‌లో నిలవాలనీ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ముందుగా దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు వేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మొదట 130 పాఠశాలల్లో ప్రారంభించిన ఖిఆరోగ్య పాఠశాలఖి కార్యక్రమం, ప్రస్తుతం 250 పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, తద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యలు తగ్గి, పాఠశాల హాజరు శాతం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణించాలని, క్రీడా రంగంలో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటలో ఉద్యగాలు సాధించవచ్చున్నారు. సీఎం కప్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో బేల ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పిలునిచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు సుమారు 3 లక్షల రూపాయలు అందించారని, ఆ నిధులతో విద్యార్థుల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందందనీయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను శాలువాలతో సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పాఠశాలలో కిచెన్ షెడ్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలపై గోడలపై పెయింటింగ్ లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, దాతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**వేమనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు విద్యార్థుల నైపుణ్యం పండుగను పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో పాఠశాల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. తెలుగు సంస్కృుతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. నేటి తరానికి మన భారతీయ సంస్కృుతి, పండుగల విశిష్టతను తెలియజేయడానికే పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంప్రదాయాలను గౌరవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## కానుసతి మాత ఆలయ నిర్మాణానికి కృషి చేయాలి

**నేరడిగొండ, జనవరి 9, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండల కేంద్రంలో ఓడ్ సమాజ్ కుల దేవత శ్రీ ఆదిశక్తి కానుసతి మాత దేవాలయం నిర్మాణం కొరకు దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించాలని శుక్రవారం సమాజ్ సభ్యులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామి ఇచ్చారు.

## సస్పెండ్ అయిన హెచ్‌ఎం మాకు వద్దు

**ఇచ్చోడ, జనవరి 9, ప్రభాతవార్త:**

మండలంలోని మేడిగూడ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యార్థులకు వచ్చిన సరుకులు పక్కదారి పడుతున్న ఆరోపణలు వచ్చాయి. దీంతో పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన స్వర్ణలతను సస్పెండ్ చేస్తూ డిసెంబర్ 29న ఉట్నూర్ ఐటిడిఎ పిఓ యువరాజ్ మర్మట్ ఆదేశాలు జారీ చేశారు. పది రోజులలోనే మరో జాయినింగ్ లెటర్‌తో మేడిగూడ ఆశ్రమ పాఠశాలకు రావడంతో గ్రామస్తులు జాయిన్ అవ్వకుండ అడ్డుపడ్డారు.




ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

## నాగోబా జాతరకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వానం

**నేరడిగొండ, జనవరి 9, ప్రభాతవార్త:**

నాగోబా జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు నాగోబా ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్ల గురించి కమిటీ సభ్యులు వివరించారు. ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే నాగోబ జాతరను సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జాతర విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాగోబా ఆలయ కమిటి సభ్యులు




## జర్నలిస్ట్ రమేష్‌ను దూషించిన కార్ముకారి రాంచందర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**- బెల్లంపల్లిలో నల్ల బ్యాడ్జిలతో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన**

**బెల్లంపల్లి, జనవరి 9, ప్రభాతవార్త**

ఎన్టీవీ బెల్లంపల్లి నియోజకవర్గ రిపోర్టర్ అందుగుల రమేష్ ను అకారణంగా దూషించి చంపుతామని బెదిరించిన మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ నాయకుడు కార్కురి రాంచందర్ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఎన్.టీ.విలో వచ్చిన ఒక కథనం పై ఎన్‌టీవి బెల్లంపల్లి నియోజకవర్గ రిపోర్టర్ అందుగుల రమేష్‌కు ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ చంపుతామని బెదిరించడం అమానుషం అన్నారు. రామచందర్ పై పోలీసులు కేసు నమోదు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వానికి జర్నలిస్టు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు పులియాల రాజు, ఉప్పులేటి లక్ష్మణ్, కోలా వెంకటేష్, వికాస్ యాదవ్, తణుకు కృష్ణమూర్తి, మేకల భీమన్న, దాసరి తిరుపతి, కొలిపాక శ్రీనివాస్, బడుగు శ్రీనివాస్, ఇడిదివేని రాధాకృష్ణారావు, నగరం. నిరంజన్, కలువల ప్రతాప్, మోసం శ్రీనివాస్, గరిగ వేణుగోపాల్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్ముకారి రాంచందర్ పై బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.

## మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**సారంగాపూర్, జనవరి 09, ప్రభాతవార్త:**



మండలంలోని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చిన్నోళ్ల రాజకుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చౌహాన్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్ చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా షేక్ కైసర్, కోశాధికారిగా చంద్రమోహన్ గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ఆడెపు శ్రీనివాస్, సలహా సభ్యులుగా పి సిద్ధూ, వి నవీన్, కొండా రమేష్, షేక్ పహీంరహనుమా, సభ్యులుగా ఆర్ భోజన్న, లక్ష్మీనారాయణ, దోడ భోజన్న, టీ భోజన్న, టీ నిఖిల్, ఎం రాజేశ్వర్, విశ్వేశ్వర్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పాత్రికేయ మిత్రులు శాలువా కప్పి సన్మానించారు.

## అర్హులందరికీ ఇండ్లు అందేలా కృషి చేస్తా

**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**నేరడిగొండ, జనవరి 9, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు అందేలా కృషి చేస్తానని ఎవరు ఆదర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నియోజకవర్గ ఆడపడుచులకు ఎమ్మెల్యే సంక్రాంతి కానుక

- ఏడో ఏడాది విజయవంతంగా చీరల పంపిణీ - ప్రజాసేవకే మా ప్రాధాన్యత: కొక్కిరాల సురేఖ





**నస్పూర్, జనవరి 9, ప్రభాతవార్త**

మంచిర్యాల నియోజకవర్గ ఆడబిడ్డలకు సంక్రాంతి పండుగ వేళ గొప్ప కానుక అందింది. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో చీరల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియం, కొత్త నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో స్థానిక మహిళలకు ఎమ్మెల్యే సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఈ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ.. 2018 సంవత్సరంలో ప్రారంభించిన ఈ చీరల పంపిణీ కార్యక్రమం ఈ ఏడాదితో విజయవంతంగా ఏడవ వసంతానికి చేరుకుందని తెలిపారు. గత బతుకమ్మ పండుగ సమయంలోనే ఈ చీరలను అందించాలని భావించినప్పటికీ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అనారోగ్యానికి గురికావడంతో అది సాధ్యపడలేదని వివరించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడటంతో, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తన అక్కచెల్లెళ్లకు ఈ కానుకలు అందజేయాలని ఆయన కోరినట్లు వెల్లడించారు. తాము అధికారంలో లేనప్పుడు కూడా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని ఆమె గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రేమ్ సాగర్ రావు కట్టుబడి ఉన్నారని, ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సురేఖ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంచిర్యాల పట్టణంలో 320 కోట్ల రూపాయల వ్యయంతో 600 పడకల అత్యాధునిక ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అలాగే లక్షెట్టిపేటలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించామని తెలిపారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే తపనతోనే ప్రేమ్ సాగర్ రావు రాజకీయాల్లోకి వచ్చారని, ప్రజల సేవలో ఎప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఆడబిడ్డలందరూ సంక్రాంతి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనాధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

- మానవసేవే మాధవసేవ నినాదంతో సేవా కార్యక్రమాలు - దొమ్మటి విజయ్‌కుమార్

**మందమర్రి, జనవరి 9, ప్రభాతవార్త**



కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి సేవతో పాటు మానవసేవే మాధవసేవ అనే నినాదాన్ని ఆచరిస్తూ, గోవిందా పతి శ్రీవారి సేవ సమితి, మంచిర్యాల వారి ఆధ్వర్యంలో చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని అనాధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు సమితి ప్రెసిడెంట్ దొమ్మటి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీనివాసుని సేవతో పాటు కమిటీ సభ్యుల ఆకాంక్ష మేరకు గోవిందా పతి శ్రీవారి సేవ సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సేవా భారతి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఏకలవ్య ఆశ్రమంలోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సేవా సమితి ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. పాల్గొన్న ప్రముఖులుఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో మందమర్రి పట్టణానికి చెందిన జనరల్ సెక్రటరీ పోలు సంపత్, ముఖ్య సలహాదారుడు సత్యప్రసాద్, ట్రెజరర్ గోలి కుమార్, ముఖ్య కమిటీ సభ్యుడు బూరుగుమోహన్, రిటైర్డ్ జీఎంపీఏ ప్రసాద్ గంపచంద్రుడు, శ్రీనివాస హార్డ్‌వేర్ యజమాని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

రైతు దంపతులకు ఘన సన్మానం; సంస్కృతిని చాటిన విద్యార్థులు

**మంచిర్యాల, జనవరి 9, ప్రభాతవార్త**



జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బ్రాంచ్ 1 ఆవరణలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తు సంబరాలు వైభవంగా జరిగాయి. గ్రామీణ సంస్కృుతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏజీఎం అరవింద రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులకు మన పండుగల విశిష్టతను, రైతు ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. పండుగ వేడుకల్లో భాగంగా సమాజానికి వెన్నెముకైన రైతును గౌరవించుకోవడం విశేషం. కార్యక్రమంలో ఒక రైతు దంపతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏజీఎం అరవింద రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ మన సంస్కృుతిలో అంతర్భాగమని, పంట చేతికొచ్చే వేళ రైతు జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకలకు హాజరై పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారని ప్రశంసించారు. విద్యార్థుల కోలాహలంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్, హైస్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రైమరీ కోఆర్డినేటర్లు జయశ్రీ, రోజా, ప్రైమరీ ప్రిన్సిపల్ స్రవంతి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



## క్షయ వ్యాధిపై విస్తృత అవగాహన శిబిరం

- జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం ప్రత్యూష

**సారంగాపూర్, జనవరి 09, ప్రభాతవార్త:**

మండలంలోని చించోలి(బి )గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమాజంలో టీబీ (క్షయ) వ్యాధి నివారణ కోసం ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం అని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం ప్రత్యూష అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ ముక్త్ భారత్ క్యాంపెయిన్ లో భాగంగా క్షయ వ్యాధి ఉచిత నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మందికి ఉచితంగా డిజిటల్ ఎక్స్ రే పరీక్షలు చేశారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు టీబీ పట్ల జాగ్రత్త పడాలన్నారు. ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, రాత్రిపూట చమటలు పట్టడం, దగ్గినప్పుడు రక్తం పడటం, అలసట నీరసం, గతంలో అనారోగ్య సమస్యలతో బాధపడిన వారు, చాతిలో నొప్పి, శరీరంలో ఏ భాగంలోనైనా వాపు లాంటి లక్షణాలు ఉన్నట్లయితే గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే తెమడ పరీక్ష, ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయన్న, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్ గౌడ్, సిబ్బంది రవి కిరణ్, పవన్, నుస్రత్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెంటు బాటిల్ పేలి ముగ్గురికి గాయాలు

**ఇచ్చోడ, జనవరి 9, ప్రభాతవార్త:**



మండలంలోని ఎస్సీ కాలనీలో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృధాగా పడిన చెత్త సేకరించి చలిమంట పెట్టి కాగుతూ ఉండగా చెత్తలో సెంటు బాటిల్ ఉండడంతో అకస్మాత్తుగా పెద్ద శబ్దం చేస్తూ పేలింది. ముగ్గురికి గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిఐఈఓ ఆకస్మిక తనిఖీ

**బజార్‌హత్నూర్, జనవరి 09, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా ఇంటర్ మాధ్యమిక విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐఈవో కళాశాలలో అధ్యాపకుల యొక్క పనితీరు, పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ 45 రోజుల పక్కా ప్రణాళికతో వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఫిబ్రవరి లో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు కూడా తగినటువంటి రికార్డులను పూర్తి చేయాలని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే సునీల్ కుమార్, బోథ్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు ప్రదీప్, జ్ఞానేశ్వర్, భీమేష్, అశోక్ రెడ్డి, సుభాష్ అహ్మద్ వనజ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలలో నట్టల నివారణ టీకా తప్పనిసరి

**ఇచ్చోడ, జనవరి 9, ప్రభాతవార్త:**



గొర్రెలు,మేకలలో నట్టల నివారణ టీకా తప్పనిసరి మండల పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొరిగామ గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఆసిఫ్ టీకాల పంపిణీని ప్రారంభించారు. పశువులకు సరైన సమయంలో మందులు వేయించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

# స్వదేశం నుంచి విదేశాలకు సేవల కోసం ఎగుమతి చేయబడ్డ సంస్థ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్

**మంచిర్యాల, జనవరి 9, ప్రభాతవార్త**

మనదేశంలో పుట్టి మనదేశంలో విశిష్ట సేవలు కోసం ఏర్పడ్డ వాసవి క్లబ్జాతీయ సంస్థ అనేక సేవలు చేయడానికి విదేశాలకు కూడా ఎగుమతి చేయడం జరిగిందని, ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో కూడా ఎనలేని సేవలను చేస్తున్న ఏకైక సంస్థ వాసవి క్లబ్ అంతర్జాతీయ సంస్థ అని తక్షణ అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు, 2026 సంవత్సరానికి పర్మినెంట్ ప్రాజెక్టు డిసిప్లినరీ కమిటీ చైర్మన్ ఇరుకుల రామకృష్ణ అన్నారు. గురువారం మంచిర్యాలలోని శ్రీనివాస గార్డెన్‌లో జరిగిన జిల్లా వి 107 ఏ 9 వ క్యాబినేట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమంలో ముఖ్య అథితిగా పాల్గొన్న మన తక్షణ పూర్వపు అంతర్జాతీయ అధ్యక్షులు, చైర్మన్ పర్మినెంట్ ప్రాజెక్ట్స్, డిసిప్లినరీ కమిటీ వి ఎన్ ఇరుకుల్ల రామకృష్ణ మాట్లాడుతూ,అంతర్జాతీయ వాసవి క్లబ్ అనేక వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు అండగా నిలుస్తుందని ఎందుకు వడ్డీ లేని రుణాలను వ్యాపార నిమిత్త ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వాసవి క్లబ్ సభ్యుల నుండి నిరుపేదలు ఎవరైనా చనిపోతే మహాప్రస్థానం పథకం కింద 25 వేలు రూపాయలు దహన సంస్కారాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుపేద పిల్లలకు ఉచిత పుస్తకాల పంపిణీ స్కాలర్షిప్ల మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కులాలకతీతంగా వాసవి క్లబ్ సభ్యుల ఆర్థిక అండదండలతో అనేక పర్మినెంట్ ప్రాజెక్టులను ఇమేజ్ బిల్డింగ్ నిర్మించడం జరిగిందని భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్లచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డిస్టిక్ వి1078 గవర్నర్ పుల్లూరు బాల్మోహన్జిల్లా ఇంచార్జీలకు, రీజియన్ సెక్రెటరీలకు, క్యాబినేట్ జాయింట్ సెక్రెటరీలకు, క్యాబినేట్ జాయింట్ ట్రెజరర్‌లకు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లకు, జోన్ చైర్పర్సన్లకు, డిస్ట్రిక్ట్ చైర్పర్సన్లకు, క్లబ్బుల అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కోశాధికారులకు 26 క్లబ్బులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐఇసి అధికారులు సిరిపురం రాజేష్, రేణిగుంట్ల శ్రీనివాస్, ముక్తా శ్రీనివాస్,కటకం హరీష్, పవిత్రం శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, బాల సంతోష్, జంధ్యం మాధవి, ఇల్లందుల కిషోర్ కుమార్, క్యాబినెట్ సెక్రటరీలు ఎల్లంకి ప్రదీప్, కేశెట్టి వంశీకృష్ణ, క్యాబినెట్ ట్రెజరర్ కుంకుమంటి వెంకటేశ్వర్లు, వైస్ గవర్నర్ రాజ భాస్కర్, రీజియన్ చైర్మన్లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ

## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించిన ఆర్టీఓ

**ఉట్నూర్, జనవరి 9, ప్రభాతవార్త :**

రోడ్డు నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలలని ఆర్‌టీఓ అన్నారు. శనివారం మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్డు లో రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఎంవిఐలు ఆశ్వంత్, రవీందర్, ఫహిమా సుల్తానా ఆర్టిఏ మెంబర్ రాజేశ్వర్, ఎస్సై కే ప్రవీణ్ కుమార్ సర్పంచ్ మాయ హరినాయక్,గ్రామ పెద్దలు జాదవ్ నాందేవ్ నాయక్, మేంగని లింగన్న, నరేష్, మనం ఆటో యూనియన్ అధ్యక్షుడుజాదవ్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సిద్ధార్థ్, కార్యదర్శి ఆరిఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


వార్త క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ డి డి జాదవ్ అంబాజీ

## సమాజ నిర్మాణంలో వార్తా పత్రికలది కీలక పాత్ర

**ఉట్నూర్, జనవరి 9,ప్రభాతవార్త :**

సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చేరవేయడంలో వార్తా దిన పత్రికల కీలక పాత్ర పోషిస్తున్నాయని డి డి అంబాజీ జాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు-ప్రభుత్వం మధ్య అనుసంధాన వంతెనగా నిలుస్తూ, ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వార్త రిపోర్టర్ జాదవ్ వసంత్ రావు, బానోత్ రవీందర్ పాల్గొన్నారు.

## బహుమతులను అందజేస్తున్న సర్పంచ్ మాయ జాదవ్

**ఉట్నూర్, జనవరి 9,ప్రభాతవార్త :**

విద్యార్థులు మంచి మనసుతో చదివి ముందస్తు స్థాయికి ఎదగాలన్ని లింగోజితండా సర్పంచ్ మాయ జాదవ్ అన్నారు. శుక్రవారంమండలంలోని లింగోజితండా గ్రామపంచాయతి లోని న్యూ న్నలదా పాఠశాలలో ముందస్తు సంక్రాతి పండుగ సందర్బంగా పాఠశాల విద్యార్థులకు ముగ్గులు, పతంగ్ ల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మొదటి, ద్వి తీయ బహుమతులను అందజేశారు.అనంతరం సర్పంచ్ మాయ జాదవ్ కి ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జాదవ్ గణపత నాయక్, కరెస్పాండంట్ /ప్రిన్సిపాల్ జాదవ్ వసంత్ రావు, ఉపాధ్యాయులు ఉమాదేవి, మోనిక, అయేషా, సంధ్య, అనుశ్రీ, సుప్రియ, రజిత, రితిక,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మాయ జాదవ్


అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాలిసిన జాగ్రత్తలను చూస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే,ఎస్పీ నితికా పంత్

## ప్రమాద రహిత ప్రయాణం దిశగా సాగాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్, జనవరి 9, ప్రభాతవార్త**

రోడ్డుపై వాహనాలు నడుపుతున్నప్పుడు ప్రతి ఒక్కరు ప్రమాద రహిత ప్రయాణం దిశగా సాగాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిపో మెనేజరు రాజశేఖర్ అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ, రవాణా శాఖ, రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలకు జిల్లా ఎస్పీ నితిక పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, జిల్లా ఫైర్ అధికారి భీమయ్య తో కలసి హాజరయ్యారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత కీలకమని తెలిపారు. ఆర్టీసీని ప్రమాదాల రహిత ప్రయాణంగా రూపొందించడంలో డ్రైవర్ల పాత్ర ఎంతైనా ఉందన్నారు. డ్రైవింగ్ సమయంలో నిరక్ష్యంల్లె చేయకూడదని సూచించారు. ఒకరి నిరక్ష్యంల్లెతో ఎంతోమంది ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రతిక్షణం విలువైనదేనని గుర్తుంచుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని అలా చేస్తే రోడ్డు ప్రమాదాల నివారణ శత శాతం సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో 202425 తో పోలిస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్యలో పెద్దగా మార్పు లేదని, దానిని పూర్తిగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు సహకరించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. అంతకుముందు భద్రత మాసోత్సవాల్లో భాగమైన డిఫెన్స్ డ్రైవింగ్, వాహనాలు నడిపేటప్పుడు జరిగే అగ్ని ప్రమాదాల నుండి బయటపడడానికి చేపట్టాల్సిన చర్యలు, ప్రమాదం జరిగిన తర్వాత జరగకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స లాంటి వాటిపై అగ్నిమాపక శాఖతో పాటు, వైద్యాధికారులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. సిబ్బందితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సీతారాం, వైద్యుడు వినోద్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

**ఉట్నూర్, జనవరి 9,ప్రభాతవార్త :**

పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి చలో హైదరాబాద్ వడ్డే ఓబన్న జయంతి ని విజయవంతం చేయాలని పోస్టర్లను విడుదల చేశారు. మండల అధ్యక్షులు ఓల్లెపు భుజంగ్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో ఈ నెల 11వ తేదిన నిర్వహించబోయే వడ్డే ఓబన్న జయంతి కి ప్రజలు భారీఏతున్న తరలి వచ్చి జయంతి ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వడ్డే ఓబన్న జయంతి పోస్టర్ విడుదల చేస్తున్న బీసీ సంఘ నాయకులు

## కస్తూరిబా విద్యాలయంలో వసతుల పరిశీలన

**పెంచికల్ పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో ఆల్బర్ట్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వంటగది, స్టోర్ రూమ్ లను పరిశీలించిన ఎంపిడిఓ మెనూ ప్రకారం భోజనం నాణ్యతతో అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ చిన్ను, ఇంచార్జ ప్రత్యేక అధికారి సుమతి, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.





## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**దిలావర్‌పూర్, జనవరి 09, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని దాస్ హనుమాన్ సన్నిధానంలో అయ్యప్ప స్వాములు శుక్రవారం ఇరుముడి ధరించి, శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు 41 రోజులపాటు ఎంతో కఠోరమైన దీక్షలను నియమ నిబంధనలతో పాటించి బైండ్ల గురుస్వామి స్వాములకు ఇరుముడి కట్టారు. ఇరుముడి అనంతరం 18మెట్ల పూజ చేసి, ఇరుముడి నెత్తిన ధరించి శబరిమల బయలు దేరి వెళ్లారు. అయ్యప్ప స్వాములు శబరిమలై వెళ్తున్న సమాచారం తెలుసుకున్న బంధువులు, మిత్రులు అధిక సంఖ్యలో హాజరై అయ్యప్ప స్వాముల ఆశీర్వాదాన్ని పొందారు.



## పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

**నార్నూర్, జనవరి 09, ప్రభాతవార్త:**

నార్నూర్ మండలకేంద్రంలోని సుంగాపూర్ ఏంపిపిఎస్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాల కొరకు తమవంతు కృషి చేస్తా అన్నారు. విద్యార్థుల భద్రత కొరకు పాఠశాలలోని ప్రహరీ గోడ నిర్మాణం పనులు చెపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ లచ్చు, అశ్విని, సంధ్యారాణి, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## గణితంలో పిహెచ్‌డి పట్టా పొందిన జిల్లా వాసి

**ఆసిఫాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:**

గణితంలో పిహెచ్డి సాధించాలంటే కృషి, పట్టుదల, నిబద్ధత ఉండాలి. సాధారణంగా గణితంలో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపరు. కానీ కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం జెండా గూడా గ్రామానికి చెందిన మసాదే రాజ్ కుమార్ గణిత శాస్త్రంలో నిష్ణాతులయ్యారు. ఏకంగా పిహెచ్డి పట్టాను సాధించి జిల్లా నుంచి గణిత శాస్త్రంలో పట్టా పొందిన మొట్టమొదటి వ్యక్తిగా పేరు సంపాదించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో స్టెబిలిటీ ఎనాలిసిస్ ఆఫ్ మల్టీ స్పీసీస్ ఏకోలాజికల్ మోడల్స్ అనే పరిశోధన సిద్ధాంతానికి గాను ఆయనకు ఈ గౌరవ డిగ్రీ లభించిందని, ఈ పరిశోధన డాక్టర్ ఆచార్య, బి.హరి ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిందని, ఈ పట్టాను అధికారికంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యం. రవీందర్ ప్రదానం చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఐటీడీఏలో పని చేసిన దివంగత ఉద్యోగి మసాదే బాపు, లక్ష్మి దంపతుల నాలుగో కుమారుడు రాజ్ కుమార్ పదవతరగతి వరకు ఆసిఫాబాద్ పీటీజీ స్కూల్ లో చదువుకున్నారు. ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, డిగ్రీ, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్నారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఏపీపీఎస్సి ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు గణితం లెక్చరర్ గా ఎంపికయ్యారు. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూనే చదువుపై ఉన్న ఆసక్తిని ఏమాత్రం తగ్గించుకోకుండా పీహెచ్డీ పట్టాను సాధించుకున్నారు.



పీహెచ్డీ పట్టాను తీసుకుంటున్న మసాదే రాజ్ కుమార్

# నెక్స్ఐరా ఐటీ కంపెనీ ప్రారంభించిన డిప్యూటీ కలెక్టర్ ఆర్‌డిఓ

**యువత ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అప్డేట్ కావాలి - శరత్ చంద్ర రఘువరన్ యువతరానికి ఆదర్శం, డిప్యూటీ కలెక్టర్**

**మంచిర్యాల, జనవరి 9, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చున్నం బట్టి వాడలో నూతనంగా నెలకొల్పబడిన నెక్స్ ఐరా మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్ ఆర్‌డిఓ జి. శ్రీనివాస్ రావు, రాష్ట్ర పర్యావరణ వాల్టా చట్టం సభ్యుడు, సైకాలజిస్ట్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్, ఐజా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. తిరుపతిరెడ్డి, టీఎస్జీవోస్ అధ్యక్షులు గడియారం శ్రీహరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాలలో ఐటి కంపెనీ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని ఇది సమకాలిన యువతకు నైపుణ్యాలు, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ, పలు సాఫ్ట్వేర్ నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. మంచిర్యాలలో ఐటి కంపెనీ సేవలు అందుబాటులోకి తెచ్చిన మేనేజింగ్ డైరెక్టర్లు ఎం శరత్ చంద్ర, సి హెచ్ రఘువరన్ లను ప్రత్యేకంగా అభినందించారు. అతిథులు మాట్లాడుతూ నేటి యువత అధునాతన టెక్నాలజీ, ఐటిపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. కంపెనీ మోటివేషన్ స్పీకర్ సైకాలజిస్ట్ గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ జీవితంలో ఆత్మవిశ్వాసంతో స్వశక్తితో ఎదగడానికిఎ .ఐ టెక్నాలజీ ఎంత అవసరమని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి కానీ తప్పుగా వినియోగించకూడదన్నారు. మంచిగా యువతకు ఋణన్యూ ఎరా టెక్గ్ ఆదర్శనీయమని ప్రశంసించారు. ఐజా కళాశాల ప్రిన్సిపల్ తమ కాలేజీ విద్యార్థి సాఫ్ట్వేర్ కంపెనీ పెట్టడం ఎంతో గర్వకారణం అన్నారు.



ఐటీ కంపెనీ ప్రారంభించిన ఆర్డిఓ

మేనేజింగ్ డైరెక్టర్లు డైరెక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాతో పరిసరాల యువతకు అందుబాటులో ఉండే విధంగా కంపెనీ సేవలు కొనసాగిస్తామని కంపెనీ లక్ష్యాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రొ .డా. రాజేష్. సివి రామన్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య, కంపెనీ ఫ్యాకల్టీ సదన్, పూర్ణిమ, మనీషా, సంపూర్ణ గాయత్రి, ఎల్ఐసి అధికారులు ఏం. రాందాస్, ఆర్.రాజేశం, రాజేశం గౌడ్ వివిధ కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రోడ్డును మరమత్తులు చేయిస్తున్న సర్పంచ్ ధరము

## చౌర్గవ్ రోడ్డు మరమ్మతు చేపట్టిన సర్పంచ్ ధరము

**నార్నూర్, జనవరి 09, నార్నూర్:**

మండల కేంద్రంలోని చౌరవ్ గ్రామపంచాయతీ పరిధిలోని వర్షాల కారణంగా కాలవర్ట్, బ్రిజ్, రోడ్డు కొట్టుకోపోవడంతో శుక్రవారం స్థానిక చోర్గవ్ సర్పంచ్ కుంర ధరము మొరం వేసి రోడ్డును మరమత్తు చేశారు. ఈ కార్యక్రమలో ఉపసర్పంచ్ సెర్పిoగ్, గ్రామపటేల్ మెస్రం ప్రకాష్. ఆత్రం శివాజీ పవర్, గజానంద్ సిడం సునీల్, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో ఏటిఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ ఆల్బర్ట్

**పెంచికల్ పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏటిఏ నూతన సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్రం భగవంత్ రావు ఆధ్వర్యంలో ఎంపిడిఓ ఆల్బర్ట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఏటిఏ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని, భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు భుజంగా రావు, శ్రీనివాస్, నాయకులు అన్నం గణపతి, సర్దార్జి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కపల్లిలో గ్రామసభ

**పెంచికల్ పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలం ఎల్కపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ భక్తు రాంచందర్ అధ్యక్షతన తొలి గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్ రాంచందర్ సానుకూలంగా స్పందిస్తూ, విడుదల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తుల సహకారంతో పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్, వార్డు సభ్యులు, కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న పాలకవర్గం, ప్రజలు

## తహసిల్దార్‌ను సన్మానించిన నూతన సర్పంచులు

**సిర్పూర్ (టి), జనవరి 9, ప్రభాతవార్త:**

సిర్పూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం రోజున తహసిల్దార్ రహీముద్దీన్ శాలువాతో నూతన సర్పంచులు సన్మానించారు. తహసిల్దార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ఏమైనా సమస్యలు ఉంటేనా దృష్టికి తీసుకు వస్తే పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ సర్పంచ్ వద్దేటి నాగమణి నానయ్య, ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, లక్ష్మీపూర్ సర్పంచ్ పిప్రే రాందాస్, ఉపసర్పంచ్ గాడి శేఖర్,కిట్టు, అజయ్, కమలాకర్,సాయి, బనార్కర్, నేరెళ్ల అశోక్,రాజేష్,రామన్న, తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

**పెంచికల్‌పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ్ కమలాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేద్దాయి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సేవలో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఫిబ్రవరి 5న నిర్వహించే చలో పార్లమెంటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జిల్లాలో 20 మంది కారుణ్య నియామకాలు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జనవరి 9, ప్రభాతవార్త**

జిల్లాలో 20 మంది యువతను కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగాలలో నియమించడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తూ ఆకస్మాత్తుగా మరణించిన వారి కుటుంబ పోషణ నిమిత్తం ఆయా కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని, ఈ క్రమంలో 20 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

**పెంచికల్ పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**

మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో చప్పిడి పెంటయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాష్, కమలాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా చప్పిడి ప్రకాష్ మాట్లాడుతూ చలికాలన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉష్ణోగ్రతలు తగ్గడంతో నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురకొంటున్నారని, వారి కష్టాలను గమనించి మనవీయతతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ చౌదరి యశోద గుండయ్య, మల్లేష్ గ్రామ పెద్దలు గణపతి, గోపాల్, మహేష్, ప్రజలు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ అధ్యక్షురాలు

**ఆసిఫాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున మహేష్ కుమార్ గౌడ్‌కు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజాసమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని సుగుణక్క టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. దీనికి స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ నాయకత్వానికి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### - ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్ - కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో నూతన సర్పంచ్‌లకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో ఎంపీడీఓ ఉజ్వల్‌కుమార్,సర్పంచ్‌లు,పంచాయతీ క్యాదర్శులు, అధికారులు



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని కాగజ్‌నగర్ ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని మండల పరిషత్తు కార్యాలయంలో నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కొత్త సర్పంచులకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సర్పంచ్ పదవి బాధ్యతాయుతమైందని, గెలిచిన సర్పంచ్ ప్రజలందరిని కలుపుకుపోతూ ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి నూతనంగా గెలిచిన సర్పంచ్‌లకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. నూతన సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో పనులను చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధం, నీటి సమస్య, వీధి దీపాలు తదితర సమస్యలపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా దశలవారీగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తన తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, ఉపాధిహామీ ఏపీఓ చంద్రశేఖర్, ఎంపీఓ గౌరీశంకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు కుమ్మరి హరీష్, కాంబ్రే ప్రణిత, గంగాధర్, రాజేశ్వర్,స్వప్న,రాజేశ్వరి, రజిత, సులోచన, సుమలత,ఛాయ,మహేష్, వాజీద్, ప్రసాద్, విలాస్,రమేష్,బాబురావు, స్వేత, రమ్య, భాగ్యలక్ష్మి,సంధ్య, లక్ష్మి,సలీం, సర్పంచులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎల్కపల్లిలో సూపర్ 30 దేస్ ఉచిత శిక్షణ

**పెంచికల్ పేట్, జనవరి 9, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలంలోని ఎల్కపల్లి (పాత పోలీస్ స్టేషన్ సమీపంలో) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఖసూపర్ 30 దేస్‌గగ ఉచిత శిక్షణను ఈ నెల 10 వ తేదీ నుంచి ప్రారంభించానున్నట్లు సామాజిక కార్యకర్త ఎలాగందుల తిరుపతి శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అనుభవం కలిగిన యువ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అందించే ఉచిత శిక్షనను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘ నాయకులు

## ఘనంగా సామాజిక సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి

**వాంకిడి, డిసెంబర్ 9, ప్రభాతవార్త :**

ప్రముఖ సామాజిక సంస్కర్త ఫాతిమా షేక్ 195వ జయంతిని వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక ప్రముఖ భారతీయ విద్యావేత్త మరియు సామాజిక సంస్కర్త అని,ఆమె భారతదేశపు మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా పరిగణించబడుతుందని అన్నారు.. ఫాతిమా షేక్ జ్యోతిరావ్ ఫూలే మరియు సావిత్రిబాయి ఫూలేలతో కలిసి పనిచేసింది, వారి పాఠశాలల్లో బోధించింది మరియు అణగారిన వర్గాలకు విద్యను అందించడంలో కీలక పాత్ర పోషించిందని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ అన్నారు.ఫాతిమా షేక్ 1831లో మహారాష్ట్రలో జన్మించింది. ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్, జ్యోతిరావ్ మరియు సావిత్రిబాయి ఫూలేలకు ఆశ్రయం ఇచ్చాడు, వారు కుల వివక్ష కారణంగా తమ ఇంటిని విడిచిపెట్టవలసి వచ్చింది. ఫాతిమా షేక్ సావిత్రిబాయి ఫూలేతో కలిసి పనిచేసింది మరియు అణగారిన వర్గాలకు విద్యను అందించడంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షులు దుర్గం దుర్గాజి, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, అంబేద్కర్ సంఘం ఉపా ధ్యక్షుడు దుర్గం సునీల్, కార్యదర్శి రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షులు శ్యామరావు లహుజీ దర్గే, రాజేశ్వర్ ఉప్రే, ఉపాసకులు పాండుజీ జాడే,నాయకులు దుర్గం మనోజ్,బల్వంత్ ఉప్రే, ఇంద్రజిత్, స్వాగత్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల సర్వతోముఖాభివృద్దే ఉపాధ్యాయుల ధ్యేయం కావాలి

### - మండల విద్యాధికారి వై సాయన్న

**నర్సాపూర్(జి), జనవరి 09, ప్రభాతవార్త:**

విద్యార్థులను ఉత్తములైన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని మండల విద్యాధికారి వై సాయన్న ఉద్ఘాటించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) టేబుల్ క్యాలెండర్, వాల్ కేలండర్‌ని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ రవీంద్ర కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమాన్ని విజయవన్నత చేయడంలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్‌తో పాటు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను విజయవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్‌రూరల్, జనవరి 9, ప్రభాతవార్త:**

జిల్లా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్ర తెలియజెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ నెల 19 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించబోయే నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానించాలని చెప్పారు. సంతకాల బోర్డు, సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన సూచనలను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే సందర్శకుల సంఖ్యను ముందుగా అంచనా వేస్తూ, అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ రాజేందర్, అగ్నిమాపక అధికారి శివాజీ, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న దృశ్యం

# పేదలకు అండగా జిల్లా యంత్రాంగం

### భవానీగూడలో కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా చలి దుప్పట్ల పంపిణీ

**ఆదిలాబాద్, జనవరి 09, ప్రభాతవార్త:**

జిల్లాలోని నిరుపేదలకు, అవసరార్థులకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండలంలోని భవానీగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పేదలకు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. చలికాలంలో తమ అవసరాలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినందుకు కలెక్టర్‌కు, అధికారులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, తహసీల్దార్ రఘునాథ్ రావు, ఎంపీడీవో ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**వేమనపల్లి, జనవరి 9, ప్రభాతవార్త**

నాడైనా నేడైనా ఏనాడైనా పేదోడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ జెడ్పీటీసి ఆర్. సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం నీల్వాయి గ్రామంలో అలియా అబ్దుల్ ఖాన్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో కుమార స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, స్థానిక సర్పంచ్ చెన్నూరి సమయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహప్రవేశ సమయంలో లబ్దిదారుల కళ్ళలో కనిపించిన ఆనందం, భావోద్వేగం చూస్తుంటే, ఇంటి నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగ్ల వహించిందో స్పష్టమవుతోందని పేర్కొన్నారు. మండలంలోనే మొదటి ఇంటిని నిర్మించుకున్న అబ్దుల్ ఖాన్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలో ఉన్న మిగితా లబ్ధిదారులు కూడా త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళు రానున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో మండలంలోని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్ గాలి మధు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, గొర్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక కార్యకర్తలకు పార్టీ టికెట్లు ఇవ్వాలి

### - టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు



సమావేశంలో మాట్లాడుతున్న టీబీఎస్ఎస్ నాయకులు

**మంచిర్యాల, జనవరి 9, ప్రభాతవార్త**

రాష్ట్రంలో సంవత్సరాలుగా ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్తలకు రాజకీయ పార్టీల్లో తగిన గుర్తింపు ఇవ్వాలని, తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు మోతె అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ వేదిక జిల్లా అధ్యక్షుడు గుడిసెల రాజారాంతో కలిసి ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లు సామాజిక కార్యకర్తలకు కేటాయించాలని రాజకీయ పార్టీలను ఆయన కోరారు. ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాలను పంచుకుంటూ, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సామాజిక కార్యకర్తలే నిజమైన నాయకులు. అలాంటి వారిని పక్కన పెట్టి డబ్బు, బలప్రదర్శన, వంశపారంపర్య రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యం బలహీనపడుతోంది అని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కార మార్గాలు చూపగల సామర్థ్యం సామాజిక కార్యకర్తలకే ఉంది. వారికి ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే పాలన మరింత ప్రజోపయోగంగా మారుతుందని, ఆయన స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, బలహీన వర్గాలకు చెందిన సామాజిక కార్యకర్తలకు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ సభ్యులు హుస్సేన్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

# చైనా మాంజా వాడితే కఠిన చర్యలు

### - ప్రాణాలకు ముప్పు - పర్యావరణానికి హాని

### - మందమర్రి ఎస్.ఐ. రాజశేఖర్ హెచ్చరిక

**మందమర్రి, జనవరి 9, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే ఉత్సాహంలో ప్రజలు, ముఖ్యంగా యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని మందమర్రి ఎస్.ఐ. రాజశేఖర్ సూచించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిషేధిత చైనా మాంజా (నైలాన్/సింథటిక్ దారం) వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చైనా మాంజా గొంతుకు తగిలితే తీవ్రంగా కోసుకుపోయే ప్రమాదం ఉందని, గతంలో ఇలాంటి ఘటనల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయని ఎస్.ఐ. రాజశేఖర్ గుర్తుచేశారు. పర్యావరణానికి తీవ్ర నష్టంపర్యావరణానికి మేలు చేసే పక్షులు చైనా మాంజాకు చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయని, ఇది ప్రకృతికి తీరని నష్టమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఫ్యాన్సీ, జనరల్ స్టోర్లలో నిషేధిత చైనా మాంజా విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో వారు ఉపయోగించే దారం ఏ రకమైనదో తల్లిదండ్రులు తప్పనిసరిగా గమనించి, ప్రమాదాలను నివారించాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఐ. మిలన్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొని పట్టణంలోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు, వ్యాపారులకు చైనా మాంజా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.



# ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దు

### - ఐటిడిఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్, జనవరి 9, ప్రభాతవార్త**

ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టల్లో గురుకులాలలో చదువుతున్న విద్యార్థుల విద్యార్థులకు సరఫరా చేసే ఆహార పదార్థాలు, సరుకుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దు అని, నాణ్యత ప్రమాణాలను పాటించని గుత్తేదారులను బ్లాక్ లిస్ట్ చేయటానికి కూడా వెనకాడబోమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐటీడీ ఏ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూగిరిజన సంక్షేమ వసతి గృహాలకు అవసరమైన ఆహార పదార్థాలు సరఫరా చేయటానికి కావలసిన గుత్తేదారులను ఖరారు చేయటానికి గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ధరల నిర్ణయం కమిటీ సభ్యుల సమక్షం లో సమావేశం ఏర్పాటు చేశారని అన్నారు. ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న గుత్తేదారుల ఆహారపదార్థాల నమూనాలు కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఐటమ్ విషయం లో ప్రాజెక్ట్ అధికారి కల్పించుకొని నమూనాలు పరిశీలించి ధరలు నిర్ణయించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి 15 మంది గుత్తేదారులు ఈ టెండర్ లలో పాల్గొన్నారు. ఈ ధరల నిర్ణయం కమిటీ కన్వీనర్, జీసీసీ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్, సభ్యులు ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ, జీసీసీ సీనియర్ మేనేజర్లు సంతోష్ కుమార్, తారా చంద్, జీసీసీ మేనేజర్లు గులాబ్ సింగ్, లక్ష్మణ్, రమేష్, ఇస్తారి, మనోహర్, సహాయ గురిజన సంక్షేమ అధికారులు సదానందం, శ్రీనివాస్, వసతి గృహాల వార్డెన్ లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీ ఏ పి ఓ యువరాజ్ మర్మాట్